# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 164 | వరంగల్ | మంగళవారం, 17 మార్చి 2026 | పేజీలు : 02


## ఆకస్మిక తనిఖీలు చేసిన అదనపు కలెక్టర్



**జనగామ, పాలకుర్తి వాణి:** అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ జనగాంలోని ప్రభుత్వ SCDD బాయ్స్ హాస్టల్, TMRJC బాయ్స్ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. కిచెన్ , స్టాక్ రిజిస్టర్లు, స్టాఫ్ అటెండన్స్ రిజిస్టర్ లను ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, భోజన తయారీ , స్టాఫ్ అటెండెన్స్ పై సూచనలను సంబంధిత ప్రిన్సిపాల్, వార్డెన్స్ లకి తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, పాలకుర్తి వాణి: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హల్ లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 224 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు.



### కొన్ని దరఖాస్తులు ఇలా..

పాలకుర్తి మండలం, విస్నూర్ గ్రామానికి చెందిన బి. వసంత, గత 12 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాస గ్రామంలో జీవనం సాగిస్తున్నారని, గుంట పావు భూమి కూడా ఇక్కడే కలదని, అయితే ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు కోసం జనగామ జిల్లా పరిధిలో దరఖాస్తు చేసినారని, కావున తన ప్రజాపాలన దరఖాస్తును జనగామ జిల్లా నుంచి జగిత్యాల జిల్లా పొలాస రూరల్ కు బదిలీ చేయాలని విన్నవిస్తూ దరఖాస్తు చేసియున్నారు.

తరిగొప్పుల మండలం, ఎన్యా నాయక్ తండాకు చెందిన ఎం. నిర్మల, తనకు గల ఒక గుంట భూమి పట్టా పాస్ బుక్ లాక్ అయిందని, ఆర్డీఓ లాగిన్ లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

లింగాల ఘనపురం మండలం, వడ్డిచర్ల గ్రామానికి చెందిన రమాదేవి, తనకు సొంత ఇల్లు, సొంత స్థలం ఏమీ లేదు అని, అద్దెకు ఉంటున్నాను అని, గతంలో ఇందిరమ్మ ఇల్లు కొరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను అని, తెల్ల ఆహార భద్రత కార్డు కలదని, కావున తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, నివాసం కల్పించగలరని వేడుకుంటూ దరఖాస్తు చేసుకున్నారు.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





# పూడికతీత పనులు చేపట్టండి

**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో దేవాదుల ప్రధాన కాలువ సుమారు 10 కిలోమీటర్ల మేర విస్తరించింది. కాలువ పరిధిలో ఇరువైపులా ముళ్ళ చెట్లు, కాలువ లోపల పూడిక మట్టి భారీగా పేరుకుపోయింది. గతంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి చొరవ తీసుకొని శుభ్రం చేయించారు. అనంతరం మరల అధికారులు మరిచారు. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. దిగువ రైతులకు సరిపడా సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలువ మరమతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఓ నేటిపారుదల శాఖ అధికారిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సమాధానమిచ్చారు.



# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

■ **కొడకండ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలు పెంతల బిక్షం**

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** అంగన్వాడీలకు కనీస వేతనం 18000 ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంగా అంగన్వాడీలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఉద్యమాలను ఆపలేరని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) కొడకండ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలు పెంతల భిక్షం అన్నారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో అంగన్వాడీలను అక్రమ అరెస్టులను ఖండించారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు 18 వేల రూపాయలు పెంచుతామని, పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి నేటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వై ఉపేంద్ర, బి శ్రావణి, బి నాగమణి, ఏం కోమల, ఏం స్వర్ణలత, కే అనిత, రంగమ్మ, పోలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో సివిల్ సప్లై అధికారుల దాడులు

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో పలు అల్పాహార కేంద్రాలు, భోజనశాల హోటళ్లపై సివిల్ సప్లై అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 4 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్టు సివిల్ సప్లై అధికారి లచ్చు నాయక్ తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ లను గృహ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, కమర్షియల్ గా ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. తమ పర్యవేక్షణ, నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు.





# బావిలో దూకి మహిళ ఆత్మహత్య

**పాలకుర్తి వాణి, పాలకుర్తి:** కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల అర్చన (28) కుటుంబ కలహాలతో బావిలో దూకి ఆత్మహత్య తీసుకుంది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వక వారందరి సహకారంతో ఓ మంచం సహాయంతో ఆమె మృతదేహాన్ని బావిలో నుంచి బయటికి తీశారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపుతుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# గూడూరులో అభివృద్ధి పనులకు భూమి పూజ

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి:** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరులో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మహిళా సమాఖ్య, అంగన్వాడి కేంద్రం భవనాలకు గ్రామ సర్పంచ్ మాచర్ల స్వరూప పుల్లయ్య భూమి పూజ చేశారు. పనులను ప్రారంభించారు. పల్లె అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నామన్నారు. మండల APM వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ V అంజయ్య, గ్రామ పాలన అధికారి యాదేశ్, గ్రామ ఉపసర్పంచ్ గుగ్గిళ్ళ కళ్యాణ్ పాల్గొన్నారు.



# గుడికుంట తండాలో వైద్య శిబిరం



**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. గుడికుంట తండా గ్రామ పంచాయతీలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీకి తమ వంతు కర్తవ్యంగా తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ తీ సిబ్బంది, అధికారులను సర్పంచి మహేందర్ నాయక్ సన్మానించారు. అనంతరం వారి ఆరోగ్య భద్రత దృష్ట్యా వైద్య సిబ్బందుల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించి వారికీ ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఉప సర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, కాంగ్రెష్ గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్యా రవీందర్ నాయక్, BRS పార్టీ నాయకులు భూక్యా మదన్ , గ్రామ కార్యదర్శి సతీష్, Dr. జావీద్ , ANM భాగ్య, ఆశ వర్కర్ మల్లమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341